ప్రజాశక్తి

బుధవారం 8 మార్చి 2023

8 పేజీలు







తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

అడుగడుగునా వేధింపులు

- మహిళలపై ఆగని దాడులు
- స్కీమ్ వర్కర్లపై పెరిగిన పని భారం
- చట్టాలున్నా అమలు కాని వైనం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చింది. దీనిని ఐక్యరాజ్య సమితి గుర్తించి, ఏటా నిర్వహిస్తోంది. దీని పుట్టుకకు బీజాలు 1908లో పడ్డాయి. తక్కువ పనిగంటలు, మెరుగైన జీతం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో 15 వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. ఈ మహిళల డిమాండ్లను దష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909లో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. అయితే నేటికీ మహిళలపై రోజురోజుకీ దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. వేధింపులు ఎక్కువయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూడా స్కీం వర్కర్లపై పని భారం అధికమైంది. మహిళలకు కనీస వేతనాలు కరువై, ఉద్యోగ భద్రత లేకుండా పోతుంది. మరోవైపు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు సైతం అన్ని చోట్లా శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

మహిళలపై పెరుగుతున్న నేరాలు

విజబుల్ పోలీసింగ్, దిశ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నా మహిళలపై నేరాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి.ప్రధానంగా కుటుంబ హింసకు సంబంధించిన నేరాలు పెరిగాయి. వరకట్న హత్యలు, ఆత్మహత్య ప్రేరిత నేరాలు, కిడ్నాపులు, వరకట్న చావులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయి. 2021 లో వేధింపులకు సంబంధించిన 820 కేసులు నమోదు కాగా 2022 లో 844 కేసులు నమోదయ్యాయి.ఇవి కేవలం అధికారిక లెక్కలు మాత్రమే. వెలుగులోకి రానివి ఇంకా ఎన్నో ఉన్నాయి. నేర ప్రభావిత ప్రదేశాల జియో మ్యాపింగ్, మహిళా పోలీసుల పర్యవేక్షణ తదితర చర్యల



2లో..

జిల్లాకు ఫ్లూ

- విజృంభిస్తున్న హెచ్3ఎన్2 వైరస్
- వృద్ధులు, చిన్నారులపై ఎక్కువ ప్రభావం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాను ఫ్లూ బెంబేలెత్తిస్తోంది. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు వైరస్ బారినపడి ఇబ్బంది పడుతున్నారు. తీవ్రమైన దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి వంటి సమస్యలతో బాధపడు తున్నారు. సాధారణంగా సీజన్ మారే సమ యంలో ఈ తరహా వైరస్‌లు వ్యాప్తిచెందడం సాధారణమే. వైరస్ బారినపడిన వారిలో లక్షణాలు రెండు, మూడు రోజుల్లో తగ్గిపోతుంటాయి. అతికొద్ది మందిలో మాత్రమే ఐదారు రోజులు ఉంటాయి. కాని ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న ఫ్లూ వైరస్ బాధితుల్లో లక్షణాలు వారాలు గడుస్తున్నా తగ్గడం లేదు. కనీసం పది రోజుల నుంచి మూడు, నాలుగు వారాలు వరకు ఉంటున్నాయి. దీనిపై క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఐసిఎంఆర్ హెచ్3ఎన్2 వైరస్‌గా నిర్ధారించింది. సాధారణ ఫ్లూ వైరస్‌లతో పోలిస్తే ఇది బలంగా ఉండడం, కొవిడ్, ఇతర కారణాల వల్ల ప్రజల్లో వ్యాధి నిరోధక శక్తి కొంత వరకు తగ్గడం వల్ల దీని ప్రభావం అధికంగా వుంటోందని ప్రకటించింది. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో బయటపడేందుకు అవకాశాలున్నాయి. ఈ వైరస్ బారినపడుతున్న వారిలో



2లో..

అప్రమత్తంగా ఉండాలి

గతంతో పోలిస్తే ఫ్లూ వైరస్ బారినపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంది. చిన్నారులు, వద్దులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి. అయితే ఇది ప్రాణాంతకం కాదు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు కొద్దిరోజులపాటు మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం ఉత్తమం. పోషకాలతో కూడిన వేడిగా ఉండే ఆహారం తీసుకోవాలి. చల్లని పానీయాలు, బయటి ఆహారాలకు కొంత దూరంగా ఉండాలి.

- వెంకటేశ్వరరావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తూర్పుగోదావరి జిల్లా

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం అమలాపురం ప్రకాశం వీధి యుటిఎఫ్ హోమ్‌లో ఐద్వా, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ, సిఐటియు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో మహిళలకు సంబంధించి ఎటువంటి బడ్జెట్ కేటాయించకపోగా మహిళలు నిత్యావసర వస్తువు అయిన గ్యాస్ ధరను పెంచడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన గ్యాస్ నిరసనగా కేంద్ర ప్రభుత్వంపై మహిళలు నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా అమలాపురం గడియార స్తంభం సెంటర్ చేరుకుని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, అధ్యక్షులు ఎమ్‌డి అమిదునిషా, సిఐటియు జిల్లా నాయకులు కృష్ణవేణి, అంగన్‌వాడీ నాయకులు బేబీగంగారత్నం, సిఐటియు మండల కార్యదర్శి పి.అమూల్య, మిడ్డేమీల్స్ నాయకులు బి,సువర్ణ తదితరులు పాల్గొన్నారు.




గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్నమహిళలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేకం

లోపల పేజీల్లో...

కార్టూ'నిజం'



ఉద్యోగ, ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడాన్ని సిపిఎం, సిపిఐ జిల్లా కమిటీలు తీవ్రంగా ఖండించాయి. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో వామపక్షాల సమావేశం జరిగింది. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, తాటిపాక మధు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం వేధింపులు మానుకోవాలన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ నెల 9న ఉదయం 10 గంటలకు స్థానిక గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వారం రోజులలోపు సిపిఎస్ రద్దు చేస్తానని జగన్ హామీ ఇచ్చారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. ఏడాదిగా జీతాలు సకాలంలో చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. నేటికీ ఈ నెలకు సంబంధించి 60 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదన్నారు. డిఎలు చెల్లించట్లేదని, బకాయిల ఊసెత్తడం లేదన్నారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తుందన్నారు. అక్రమ అరెస్టులు, షోకాజ్ నోటీసులతో నిరంతరం బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. ఎస్‌సిఆర్‌టి డైరెక్టరుగా ఉన్న ప్రతాపరెడ్డి కడప ఆర్‌జెడి సహా కొందరు ఉన్నతాధికారులు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతుంటే కట్టడి చేయలేని ప్రభుత్వం ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులను పాల్గొనకూడదని ఆదేశించడం గర్హనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.జ్యోతిరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎన్.రాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు

పనికి తగ్గ వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

పనికి తగ్గ వేతనం చెల్లించాలని, వివక్షత లేని సమాజం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పలువురు వ్యక్తులు పిలుపునిచ్చారు. ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో పిహెచ్‌సి ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సభ జరిగింది. ఈ సభకు సిఐటియు మండల అధ్యక్షులు టిపి.లక్ష్మి అధ్యక్షత వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆసుపత్రి ఎఎన్‌ఎం మాణిక్యం మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. శ్రామిక రంగంలో పనిచేస్తున్న మహిళలకు సమాన వేతనం అమలు చేయాలన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మైనర్ ఇరిగేషన్ పనులకు ఆమోదం

ప్రజాశక్తి -కోరుకొండ

మండలంలో రూ.18.30 కోట్ల విలువైన మైనర్ ఇరిగేషన్ పనులకు రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనామోదం లభించింది. ఈ మేరకు మంగళవారం జిఒలు విడుదలయ్యాయి. మండలంలోని శ్రీరంగపట్నంలో రాజు సప్లయి ఛానల్ పటిష్టత, బురద కాలువపై చెక్ డ్యాం పునర్నిర్మాణం, కోటి బోడెపై ఎస్‌ఎల్ బ్రిడ్జి నిర్మాణం, కోరుకొండ శ్రీరంగపట్నం గ్రామాలమధ్య బురదకాలువ ఆధునికీకరణ, కణుపూరు ముంద్రువారి చెరువుకు అత్యవసర మరమ్మతులు, సర్ప్లస్ ఛానల్‌పై బ్రిడ్జి నిర్మాణం, బుచ్చింపేట శ్రీరంగపట్నం తోటకాలువ ఆధునికీకరణ, రాఘవపురం నారాయకన్న సర్ప్లస్ ఛానల్‌పై ఐదు చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు, బొల్లెద్దుపాలెం-వినుకొండ కాలువపై చెక్ డ్యాం అత్యవసర మరమ్మతు పనులకు ఆమోదం లభించింది. బురదకాలువపై చేపట్టనున్న పనులు పూర్తయితే శ్రీరంగపట్నం గ్రామానికి ముంపుబెడద తొలగిపోనుంది ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల సంఘం ఆమోదంతో పనులు చేపట్టడానికి టెండర్లు పిలువనున్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు అన్నివేళలా కష్టపడి చదువు కొనసాగించాలని మండల మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. ఇంటర్ విద్యార్థులకు వేగేశ్వరపురం ప్రభుత్వ కళాశాలలో మంగళవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ వారికి అల్పాహారాన్ని అందించింది. ఈ సందర్భంగా రీజనల్ ఛైర్మన్ వి.చంద్రయ్య మాట్లాడారు. విద్యార్థులతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారాన్ని మానవతా సంస్థ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఇసి సభ్యులు ఎస్.రాజశేఖర్, పూర్వపు అధ్యక్షులు అప్పన చంద్రధరగుప్త ప్రిన్సిపల్ పి.గౌరీనాథ్ పాల్గొన్నారు.

అడుగడుగునా వేధింపులు...

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా మహిళపై జరిగే తీవ్ర నేరాలు తగ్గుముఖం పట్టాయని పోలీసులు చెప్పుకొస్తున్నారు.

ప్రేమించకపోతే హత్యలేనా..!

గతేడాది సెప్టెంబర్ 8న ప్రేమించిన యువతిని అతి కిరాతకంగా చంపాడు ఒక యువకుడు. పెదపూడి మండలం కాండ్రేగుల రహదారిపై ఈ ఘటన చోటు చేసుకోవడంతో అప్పట్లో సంచలనం సృష్టించింది. కరప మండలం కూరాడ లో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్న కాదా దేవిక (22)ను రంగంపేట మండలం బాలవరానికి చెందిన సూర్యనారాయణ అతి కిరాతకంగా నరికి చంపాడు. దీనిపై వెంటనే స్పందించిన న్యాయస్థానం యువకుడికి యావజ్జీవ కారాగార శిక్ష వేసింది. అలాగే గత నెల 28న కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన లీలా పవిత్రను ప్రేమించి వెంటాడిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన దినకర్ పెళ్లికి నిరాకరించడంతో బెంగుళూరులో దారుణంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. పవిత్ర చదువుల కోసం 8 ఏళ్ల క్రితమే తల్లిదండ్రులు కాకినాడకు నివాసం వచ్చారు. ఉద్యోగం నిమిత్తం ఆమె ఇటీవలే బెంగుళూరుకు వెళ్లింది. పలు సంఘటనలు లో మహిళలపై హత్యలు పెరిగిపోయాయి. కొన్ని వెలుగులోకి వస్తుండగా మరికొన్ని ఘటనలు వెలుగులోకి రావడం లేదు.

పని భారంతో సతమతం

వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు నెలలు తరబడి పెండింగ్లో ఉంటున్నాయి. ఉద్యోగ, ఆరోగ్య భద్రత దక్కడం లేదు. రాజకీయ నాయకులు,ప్రభుత్వ అధికారులు వేధింపులతో స్కీం వర్కర్లు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ముందుండి సేవలందించినా ప్రభుత్వ గుర్తింపునకు నోచుకోలేదు.అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, జీడీ పిక్కల పరిశ్రమలు, పీచు పరిశ్రమలు, ఇటుకల బట్టీల్లో సుమారు 60 వేలమంది మహిళలు పని చేస్తున్నారు. వీరంతా 12 గంటలు పని చేస్తుంటారు. కనీస వేతనాలు అమలు కావు. పని చేస్తున్న క్రమంలో ఆరోగ్య, రక్షణ సౌకర్యాలు ఉండవు. యాజమాన్యాలు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం లేదు. వీరి శ్రమతో వారు భారీగా లాభాలను ఆర్జిస్తున్నా కనీస వసతులు సైతం కల్పించకపోవడం శోచనీయం. మహిళల సమస్యలపై బహిరంగ వేదికలపై మాట్లాడే అధికారులు, పాలకులు సైతం అసంఘటిత రంగంలో ఉన్న మహిళా కార్మికుల సమస్యలను పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు.

కురుకూరులో భూముల రీసర్వే

ప్రజాశక్తి -దేవరపల్లి

కురుకూరులో మంగళవారం భూముల రీ సర్వే నిర్వహించారు. తహ శీల్దార్ ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా ఈ సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి మహిళా కన్వీనర్ గారపాటి రమా ప్రభ, కర టూరి నిత్యా నందం, ఆర్ఐ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఫ్లూ

వారిలో ఎక్కువగా తీవ్రమైన దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్ళ నొప్పులు, కొందరిలో తీవ్రమైన జ్వరం ఉంటున్నాయి. కొందరిలో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలు కూడా కనిపిస్తున్నాయి. వైద్యుల వద్దకు వెళ్లినా, మందులు వాడుతున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదని బాధితులు అంటున్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా వున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిఎంఆర్ సూచించింది. ఫ్లూయిడ్స్ అధికంగా తీసుకోవ డంతోపాటు వైద్యులను సంప్రదించకుండా ఇష్టానుసారం మందులు వాడొద్దని సూచించింది. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్లాత్ అడ్డంగా పెట్టుకోవాలని, లక్షణాలు ఉన్నవాళ్ళు ...పిల్లలు, వద్దులకు దూరంగా ఉండాలని సూచించింది. జ్వరం, ఒళ్ళు నొప్పులకు పారాసిటామాల్ వినియోగించాలని, ఇబ్బంది ఎక్కువగా వుంటే వైద్యులను సంప్రదించాలని సూచించింది. ప్రస్తుతం ఈ తరహా లక్షణాలతో ఆస్పత్రులు, క్లినిక్‌లకు వెళ్తున్న రోగుల సంఖ్య అధికంగా ఉంటోంది. జిల్లా కేంద్రంలోని జిజిహెచ్‌తో పాటు ఇతర ప్రయివేటు ఆసుపత్రులు ఒపి విభాగాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. చిన్నారుల్లో ఈ సమస్య కొంత ఎక్కువగా కనిపిస్తున్నట్టు చెబుతున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

జిల్లాలోనూ నెల రోజులుగా ఇటువంటి లక్షణాలు ఉన్న కేసులు నమోదవుతుండడంతో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఈ తరహా లక్షణాలతో వచ్చే రోగులకు సేవలందించటంతో పాటు వివరాలను నమోదుచేయాలని, ఆయా రోగులు ఎన్ని రోజులు నుంచి ఈ తరహా లక్షణాలతో బాధపడుతున్నారు వంటి అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని మెడికల్ ఆఫీసర్లకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. కఫం నమూనాలు తీసుకుని పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆయా రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందించాలని మెడికల్ ఆఫీసర్లకు, వైద్య సిబ్బందికి సూచించామని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. **నల్లజర్ల** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆశా కార్యకర్తలకు గౌరవ పురస్కారాలు అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకాశరావుపాలెం ఆశా వర్కర్, మారిశెట్టి వాణి, దూబచర్ల ఆశా వర్కర్ ఈపిచర్ల వెంకటదుర్గ లను వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు శాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు. ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కలిదిండి వెంకట చంద్రశేఖర రాజు మాట్లాడుతూ ఆపద మిత్రలుగా ఉత్తమ అవార్డులు సాధించి నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి గుర్తింపు, మంచి పేరు తెచ్చిపెట్టారన్నారు. 12 రోజుల పాటు జరిగిన శిక్షణలో ఎంతో ఓర్పుగా అత్యంత చాకచక్యంగా తమ ప్రతిభను కనబర్చిన ఆశా కార్యకర్తలు వాణి, దుర్గలను అభినందించారు. **సీతానగరం** మహిళా దినోత్సవ సందర్భంగా సూర్యచంద్ర హైస్కూల్ కరస్పాండెంట్, సెక్రటరీ కె.ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో సూర్యచంద్ర పాఠశాల ఉపాధ్యాయులు, మండలంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను మంగళవారం సత్కరించారు. రామా నర్సింగ్ హోం వైద్యురాలు సిహెచ్.శశికళ, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, జడ్‌పిటిసి సభ్యులు సిహెచ్.వెంకటలక్ష్మిలను సత్కరించారు. ప్రసన్నరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళామూర్తులందరికి అభినందనలు తెలిపారు. **కడియం** మహిళలను గౌరవించడం అందరి బాధ్యత అని ఎంఇఒ వి.ఉజపతిరాయ్ అన్నారు. కడియం మండల విద్యావనరుల కేంద్రంలో ఎస్‌టియు ఆధ్వర్యంలో మంగళవారం సభ నిర్వహించారు. ఎంఇఒ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ ఎపిఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయిని లలితలను సత్కరించారు. కార్యక్రమంలో సబ్బతి శ్రీనివాస్, ఎం.లక్ష్మణ రావు, వరలక్ష్మి, కె.శివ, రమ తదితరులు పాల్గొన్నారు.


సీతానగరంలో ఎంపిపి సత్కరిస్తున్న కె.ప్రసన్నరెడ్డి



నల్లజర్లలో సత్కారం అందుకుంటున్న ఆశా కార్యకర్తలు

సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలి

ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలకు సిపిఐ, సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలో స్థానిక సుందరయ్య భవన్లో మంగళవారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే నిరసన ధర్నాకు సన్నాహ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బోడకొండ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు కోరుతూ ఈనెల 9,10 తేదీలలో జరగనున్న ఆందోళనకు సిపిఐ, సిపిఎంలు పార్టీలు మద్దతు ఉంటుందని, 9వ తేదీన నిరసన ధర్నా చేపడుతున్నట్టు తెలియజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను నమ్మించి మోసం చేసి సిపిఎస్ రద్దు చేస్తామని గద్దెనెక్కి ఇచ్చిన హామీ మరిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంఎల్సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులను ఓటు అడిగే అర్హత కోల్పోయారని, ఇప్పటికైనా ఉపాధ్యాయులు మేల్కొని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని గుర్తెరిగి, వైసిపి ఎంఎల్సి అభ్యర్థులకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. ఎంఎల్సి ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓటు వేసుకోకుండా వారిపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా పని భారం పెడుతున్నారన్నారు. శాసనమండలిలో ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ సభ్యులు లేకుండా చేయాలని ఉద్దేశంతోనే జగన్ ఇటువంటి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతు నొక్కేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని, వాటిని తిప్పి కొట్టి మన గళం ఏంటో మండలిలో వినిపించే విధంగా మన ఎంఎల్సి అభ్యర్థులను గెలిపించే విధంగా ఉద్యోగులు ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ 9వ తేదీన జరిగే నిరసన ధర్నాకు సిపిఐ, సిపిఎం సభ్యులు, మేధావులు, సానుభూతిపరులు, ప్రజా సంఘాల బాధ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు



సాయం అందిస్తున్న ముప్పిడి కళ

వైద్యం కోసం రూ.50 వేల సాయం

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల అస్వస్థతకు గురైన గోకవరానికి చెందిన పొట్నూరి అక్షయ్‌రామ్‌కు వైద్యం నిమిత్తం ఆర్యవైశ్య మహిళా మండలి రూ.50వేల సాయం అందించారు. ఈ మొత్తాన్ని వైద్యులు పాలూరి బోసుబాబుకు ఆర్యవైశ్య మహిళ ముప్పిడి కళ మంగళవారం అందించారు. అలాగే దేవీపట్నం మండలానికి చెందిన సచివాలయ సిబ్బంది రూ.2,500 అందించారు.



సాయం అందిస్తున్న రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల

సూర్యావతి కుటుంబానికి గోరంట్ల సాయం

ప్రజాశక్తి - కడియం

చెరువు గట్టుపై ఆక్రమ తొలగింపుల్లో భాగంగా ఇంటిని కోల్పోయి, బస్ షెల్టర్‌లో తలదాచుకుంటున్న మురముండకు చెందిన గాడా సూర్యావతి, చిన సత్తియ్య దంపతుల కుటుంబాన్ని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి మంగళవారం పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. సూర్యావతి కుటుంబానికి స్థానికంగా ప్రభుత్వం స్థలం కేటాయించి, పట్టా కూడా మంజూరు చేసింది. అయితే ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక, నిలువ నీడలేక స్థానిక బస్ షెల్టర్‌ను ఆవాసంగా మార్చుకుని కాలం వెళ్లదీస్తున్నారు. స్థానిక టిడిపి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న గోరంట్ల స్పందించి మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.నాని, ఎ.చంటి, ఎం.సత్యనారాయణ, పి.రామారావుచౌదరి, ఎన్.సూర్యప్రకాష్, ఎం.గోపి పాల్గొన్నారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక రాక్ సిరామిక్స్ పరిశ్రమలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరిశ్రమ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికులు అన్ని వేళల్లో భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. సేఫ్టీ మేనేజర్ బాలాజీ కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెడ్ ప్లాంట్ (ఆపరేషన్స్) శాశ్వత్ కుమార్ మహాపాత్ర, సప్లై చైన్ జీఎం రాజేంద్ర సింగ్ మాన్, అకౌంట్స్ హెడ్ నటరాజ్, పర్చేస్ హెడ్ వెంకటేశ్వరరావు, సేఫ్టీ మేనేజర్ బాలాజీ, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ వి.జి.ఎస్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల తవ్వకాల పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లరేవు

జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఎన్..విజయ్ కుమార్, మత్స్యశాఖ జిల్లా స్థాయి అధికారుల బృందం మంగళవారం పాత కోరంగిలోని పంట పొలాలను పరిశీ లించారు. ఇటీవల తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ సీతారాంపురం గ్రామానికి చెందిన దడాల వీర వెంకట సత్యనారాయణ పాత కోరంగిలోని సర్వే నెంబర్ 248 లో తన ఏడు ఎకరాల పంటపొలానికి ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 247లో నలుగురు వ్యక్తులు సుమారు 6 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వడం వల్ల తన రెండు ఎకరాలు పంట పొలంకు నష్టం వాటిల్లిందని జిల్లా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘటనపై మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశామని జెడి విజయకుమార్ తెలిపారు. చేపల చెరువుల సాగు పరిశీలించి, చెరువుకు ఆనుకొని రెండు వైపులా ఉన్న పంట పొలాల వరి దుబ్బులను ఆయన పరిశీలించారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు విజయ్ కుమార్ విలేకరులకు తెలిపారు. ఈ పరిశీలనా బందంలో మత్స్యశాఖ డిడి ఇన్చార్జ్ శ్రావణి కుమారి, ఏ. డి. కరుణాకర్, యఫ్ డి ఓ. గోపి , వ్యవసాయ అధికారి ప్రశాంతి, రాజశ్రీ, వీఆర్వో లంక శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాలు పరిశీలిస్తున్న జెడి విజయ్ కుమార్ బృందం

పెద్దాపురం కోటపై వైసిపి జండా ఎగురవేస్తా...

ఎంఎల్ఎ అభ్యర్థి దవులూరి దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రానున్న ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేసి తీరతామని పార్టీ పెద్దాపురం ఎంఎల్ఎ అభ్యర్థి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు తెలిపారు. పెద్దాపురం నియోజకవర్గానికి వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా దొరబాబును సోమవారం పార్టీ ప్రకటించిన నేపథ్యంలో దొరబాబు తన అనుచర బృందంతో సామర్లకోట కుమార రామ భీమేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ నంది మండపంలో ఆయనకు ఆలయ ఇఒ డి.నాగమల్లేశ్వరరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబుల ఆధ్వర్యంలో పండితుల ఆశీర్వచనం అందజేశారు.అనంతరం దొరబాబు మాట్లాడుతూ గత 38 ఏళ్ల తర్వాత స్థానికులకు పెద్దాపురం నియోజకవర్గంలో ఎంఎల్ఎ టికెట్ ఖరారు అవడం భాగ్యంగా భావిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులను, కార్యకర్తలతో కలిసి పార్టీ విజయానికి ఐక్యంగా కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంఘ నాయకులు సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెష్, నెక్కంటి సాయి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, కాకినాడ జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షులు మొరంపూడి రంగ పాల్గొన్నారు.



భీమ్శ్వేరాలయంలో దొరబాబు పూజలు

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు నిల్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం ఖాళీ అయిన వి.కె.రాయపురం-2 ఎంపిటిసి స్థానానికి ఎన్నికకు సన్నద్ధతలో భాగంగా పోలింగ్ కేంద్రాల గురించి సామర్లకోట మండలంలో రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహిం చిన సమావేశంలో ఎటువంటి అభ్యంతరాలు రాలేదని ఎంపిడిఒ డీ శ్రీ లలిత ప్రకటించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపిడిఒ అభివద్ధి అధ్యక్షతన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిం చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం నేల దురవపేట గ్రామం జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందారు. ఈ ఘటనలో మరొకరు గాయాలయినట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. కడియం మండలం మాధవ రాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎలంశెట్టి వెంకన్న తన అల్లుడు ఉగ్గిన రామకృష్ణతో కలిసి పని నిమిత్తం తన మోటార్ సైకిల్‌పై వైజాగ్ వెళ్లి తిరిగి వస్తున్నారు. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో జెడ్.రాగంపేట వాటర్ ట్యాంక్ సెంటర్ వద్దకు వచ్చేసరికి అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట రోడ్డులో జెడ్.రాగంపేట ఊర్లోకి వెళుతున్న ట్రాక్టర్ వేగంగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఎలంశెట్టి వెంకన్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో వెంకన్న, అతని అల్లుడు రోడ్డు మీద పడిపోవడంతో ఎలంశెట్టి వెంకన్న (41) తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు వెంకన్న అల్లుడు ఉగ్గిన రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవ పంచనామా జరిపించి, మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

మొబైల్ షాపులో చోరీ

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని యర్నగూడెంలో ఆహా మొబైల్ షాప్‌లో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో షాప్ షట్టర్ తాళాలు పగలగొట్టి దుండగులు షాపులోనికి ప్రవేశించి సుమారు రూ.5లక్షల విలువైన సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, రూ.50 వేల నగదు అపహరించుకుపోయారని షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

ప్రజాశకి- దేవరపల్లి

దుద్దుకూరు జాతీయ రహదారిపై చక్కెరలోడు లారీ బోల్తా పడింది. మహారాష్ట్ర నుంచి ఒడిశాకు చక్కెర బస్తాల లోడుతో వెళ్తున్న లారీ మంగళవారం ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో దుద్దుకూరు జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పాడింధి. ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో ఆసుపత్రికి తలరించారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాజులూరు

చికిత్స పొందుతూ పల్లిపాలెం గ్రామానికి చెందిన రాయుడు ఏడుకొండలు (50) మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం రాయుడు ఏడుకొండలు మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బందికి గురిచేస్తూండటంతో భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన ఏడుకొండలు సోమవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగడంతో అతనిని కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో చనిపోయినట్లు వారు తెలిపారు. కేసును ఏఎస్ఐ బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోయిన సామగ్రి

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని అయ్యవరంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ములగాల రామకష్ణకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ఇంట్లో అదే గ్రామానికి చెందిన అల్లే గణేష్, సౌందర్య దంపతులు అద్దెకుంటున్నారు. ఎప్పటిలాగే వారు మంగళవారం ఉదయం కూలి పని నిమిత్తం పొలంలోకి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి మంటలో ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే మండలను ఆర్పే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్టు తెలిపారు. ఈ ఘటనలో గణేష్ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది.

గార్డెనింగ్ అండ్ ల్యాండ్ స్కేటింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ధవళేశ్వరం

స్థానిక ఆల్కట్ గార్డెన్స్‌లో ఇండియన్ బ్యాంక్ గ్రామ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి గార్డెనింగ్ అండ్ ల్యాండ్ స్కేటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి యువతకు మాత్రమే శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి కనీసం ఏడో తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. వివరాలకు 7780599939, 0883-2420242 నెంబర్లను సంప్రదించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శేష బాబ్జి

ఏప్రిల్ 5న 'చలో పార్లమెంట్'

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5 , 6 తేదీలలో జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని భవన నిర్మాణ రంగంలోని అన్ని విభాగాల కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేష బాబ్జి పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికుల నాయకత్వ శిక్షణా శిబిరం ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్ర తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5, 6 తేదీల్లో చలో పార్లమెంటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, కార్యదర్శి బాలం శ్రీనివాస్, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, ఎ.సత్య నారాయణ, ప్రకతి ఈశ్వరరావు, సురేంద్ర, కె.సతీష్, నందీశ్వరుడు, లోవరాజు పాల్గొన్నారు.



ఎన్‌జిఒ మహిళా నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

ఎన్‌జిఒ మహిళా విభాగం కార్యవర్గం ఎన్నిక

- నేడు ఎన్‌జిఒ భవనంలో సన్మానం

ప్రజాశక్తి కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జిఒ మహిళా విభాగం మహిళా చైర్ పర్సన్‌గా బి.సుజాత, కన్వీనర్‌గా అల్లం దేవి, కోశాధికారిగా అనితలను ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు ప్రకటించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎపిఎన్‌జిఒ భవనంలో నూతన మహిళా కార్యవర్గాన్ని సన్మానించనున్నట్లు జిల్లా కార్యదర్శి జ్ఞాపకాల వెంకట కృష్ణ తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, ఎం వెంకటేశ్వరరావు, సరళ చంద్రరావు, కెవిఎన్‌వి ప్రసాద్, నీలపాల వీరబాబు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న డ్రైవర్లు

ట్యాక్సీ స్టాండ్ కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలోని శ్రీ సిద్ధి వినాయక ట్యాక్సీ స్టాండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక మంగళవారం జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీ హర్ష, సిహెచ్ శివలు ఎంపి కయ్యారు. కోశాధి కారిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా సిహెచ్ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా పి దుర్గా ప్రసాద్,ఎం ప్రసన్న, చంద్రశేఖర్,పి దుర్గాప్రసాద్, లోవరాజు, జి దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని డ్రైవర్లు అభినందించారు.

మూడు వార్డులకు త్వరలో ఎన్నికలు

పెద్దాపురం మండల పరిధిలోని మూడు పంచాయతీల గోరింట, జే తిమ్మాపురం, దివిలి గ్రామాల్లో వివిధ కారణాలవల్ల ఖాళీగా ఉన్న ఒక్కొక్క వార్డుకు ఎన్నికలు జరుగుతాయని ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి మంగళవారం తెలిపారు. ఎన్నికలకు సంబం ధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల లిస్టులను ఈ మూడు గ్రామాల సచివాలయ కేంద్రాల్లో, ఎంపిడిఓ కార్యాలయం

క్లాప్ డ్రైవర్స్ ఆందోళన

- వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర పాలక సంస్థ క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) డ్రైవర్లకు వారాంతపు సెలవులు అమలు చేయాలని మంగళ వారం ఆందోళన ప్రారంభించారు. మార్చి 15 వ తేదీ లోపు సమస్యలపై స్వయంభూ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం స్పందించక పోతే సమ్మె తప్పదని ముందుగానే రాతపూర్వకంగా తెలియ జేశారు. ఈ నేపథ్యంలో సోమవారం యాజమాన్యం తరపున రాజేష్ హాజరై డ్రైవర్లతో చర్చలు జరిపారు. వారాంతపు సెలవులు అమలు చేయడం కుదరదని చెప్ప డంతో మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారాంతపు సెలవులు ఖచ్చితంగా అమలు చేయాలని, డ్రైవర్లకు బీమా చేయించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని తదితర కోరారు. వారాంతపు సెలవులు అమలు చేయించే విషయంలో నగర పాలక సంస్థ అధికారులు జోక్యం చేసుకోవాలని సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు విజ్ఞప్తి చేశారు. 8వ తేదీ నుండి నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలని నిర్ణయించారు. తదుపరి ఆందోళన తీవ్రతరం చేయాలని తీర్మానించారు. సమావేశంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎం.శివ శంకర్, గంగాధర్, సూరిబాబు, ఇస్మాయిల్, శ్రీనివాస్, నాని బాబు, రాము, దుర్గా ప్రసాద్, భద్ర, రాజు, కొండ తదితరులు పాల్గొన్నారు.


క్లాప్ డ్రైవర్ల సమావేశం లో మాట్లాడుతున్న నాయకులు

సారా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సారా తయారీ, అమ్మకాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి పి.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సబ్ అధికారులతో పెండింగ్ వాహనాలు, పెండింగ్ అరెస్టులు, పెండింగ్ జెన్‌బిడబ్ల్యుఎస్ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రవాణా అమ్మకాలను అరికట్టాలన్నారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో ఏవిధమైన ఆలస్యం లేకుండా చార్జ్‌షీటు దాఖలు చేసి కోర్టులో విచారణ ప్రారంభించేలా కృషి చేయాలన్నారు. అలవాటుగా నేరాలు చేసే వారిని గుర్తించి వారిపై హిస్టరీ షీట్లు ఓపెన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సబ్ ఎం.జయరాజు, ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిం టెండెంట్ సిహెచ్ అజయ్‌కుమార్ సింగ్, ఎపిపి జగదీష్ కుమార్, కాకినాడ సబ్ అధికారులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

వైభవంగా వెంకన్న చక్రతీర్థం

ప్రజాశక్తి - యానాం

యానాం భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా చక్రతీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సంద ర్భంగా యానాం పరిసర ప్రాంతాల మహిళలు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కళ్యాణోత్స వాలలో భాగంగా మద్దింశెట్టి సత్తిరాజు కుమారుడు డాక్టర్ ఎంవిఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో గౌతమీ గోదావరిలో స్వామివారి చక్రస్నానం నిర్వహిం చారు. అనంతరం పురవీధులలో స్వామిని ఊరేగిం చారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, డిటి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.రామ కృష్ణ, ఎస్‌పి రఘునాయిగన్ పాల్గొన్నారు.

త్వరలో అంగన్‌వాడీ సెంటర్ల పెంపు

యానాం నియోజకవర్గంలో గత కొన్ని సంవత్స రాలుగా ప్రతి బూత్‌కు ఒక అంగన్‌వాడీ సెంటర్ ఉండవలసి ఉండగా యానాంలో గత కొన్ని సంవత్సరాలుగా 9 మాత్రమే ఉన్నాయ న్నారు. ఆ సంఖ్యను త్వరలో 30 వరకు పెంచు తామని మంగళవారం ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ విషయంపై పుదుచ్చేరి సెక్రటరీతో మాట్లాడినట్లు ఎంఎల్ఎ తెలిపారు.

మహిళలకే శక్తి సామర్థ్యాలు అధికం

-అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సమాజంలో పురుషుల కన్నా శక్తి సామర్థ్యాలు మహిళలకే అధికంగా ఉన్నందున సమాజాన్ని తీర్చిదిద్దే విషయంలో మహిళలు ముందుంటున్నారని జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, కాకినాడ ఎంపి వంగా గీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సామర్లకోట జిల్లా మహిళా సాధికార సంస్థ టిటిడిసి ప్రాంగణంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యల సభ్యులు, అంగన్‌వాడీలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు పలు క్రీడా పోటీలను, రంగవల్లుల పోటీలను నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన మహిళా దినోత్సవ సభలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ కలెక్టర్‌గా ఉన్న తనకు తరచుగా పలువురు మహిళా ఉన్న మీరు కాకినాడ జిల్లాను సమర్థవంతంగా ఎలా పాలించగ లుగు తున్నారని ప్రశ్నకు "నేను మహిళను కాబట్టి చేయగలు గుతున్నానని" స్పష్టతనిచ్చారు. కాకినాడ జిల్లాలో చూస్తే జిల్లా మెజిస్ట్రేట్‌గా తాను, ఎంపీగా వంగా గీత, డిఆర్‌డిఎ పీడీ, సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ లు, జడ్‌పిటిసి, కుడా చైర్మన్, జాయింట్ కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు ఇలా ప్రధాన పాత్రలో మహిళలే ఉండి ప్రముఖ పాత్రను పోషిస్తున్నారన్నారు. అయితే కుటుంబాల్లో బాల్య వివాహాలను అరికడుతూ, ఆడపిల్లలను ఉద్యోగం వచ్చేవరకు చదివించి ఆపైనే వివాహాలు చేయాలని, మహిళలంతా సొంత ఆరోగ్యం కోసం ఒక అరగంట సమయాన్ని కేటాయించి ఏదో ఒక వ్యాయామాన్ని అలవాటుగా కొనసాగించాలని మహిళా దినోత్సవం రోజున నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రానికే దిక్సూచి కాకినాడ సమాఖ్యలని, రాష్ట్ర రాజధానికి ఎప్పుడు వెళ్ళినా కాకినాడ జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల అభివృద్ధిని రాష్ట్రస్థాయి అధికారులు కొనియాడుతూ వస్తున్నారని కలెక్టర్ కృతికా శుక్ల వివరించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపి వంగా గీత, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్ఆర్‌పి జిల్లా మహిళా అధ్యక్షురాలు మాజీ కాకినాడ మేయర్ ఎస్ శివప్రసన్న, డిఆర్‌డిఎ పిడి కే శ్రీ రమణ తది తరులు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆయా రంగాల్లో రాణించిన మండల సమాఖ్యల నాయకులకు, డిఆర్‌డిఎ, వెలుగు కార్యాలయ సిబ్బందికి కలెక్టర్, ఎంపీలు ప్రత్యేక అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సామర్లకోట పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌లు గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, బొడ్డు తులసి మంగతాయారు, జడ్‌పిటిసి ఎలిశెట్టి అమత, ఎంపీడీవో డి శ్రీ లలిత, జిల్లా సమాఖ్య నాయకులు గుడాల సంధ్యారాణి, కే గంగ తల్లి, ఏ సుమిత్ర, పెద్దాపురం ఎంపీపీ పి.సత్య వతి, జిల్లా పరిధిలోని డిఆర్‌డిఏ ప్రభుత్వ శాఖల అధికారులు, పాల్గొన్నారు.


కలెక్టర్ కృతికా శుక్లాను సన్మానిస్తున్న వీసీ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ సుమలత

జెఎన్‌టియుకెలో కలెక్టర్‌కు సన్మానం

కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో మంగళవారం అలుమ్ని ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, విశిష్ట అతిథులుగా ఉపకులపతి సతీమణి జి.అరుణ ప్రసాదరాజు, ఉపకులపతి జి.వి.ఆర్.ప్రసాదరాజు విచ్చే శారు. గౌరవ అతిథులుగా రెక్టార్ కె.వి. రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్‌డి డి.కోటేశ్వరరావు, యుసిఇకె ప్రిన్సిపాల్ ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్‌లు హాజరయ్యారు. ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్, గ్రీవెన్సెస్ డైరెక్టర్ ఎం.స్వరూపారాణి అధ్యక్షతన స్వాగతం పలకగా అతిథులు జ్యోతిప్రజ్వలన చేశారు. కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ విద్యార్థులు తమకంటూ ఒక లక్ష్యం ఏర్పర్చుకుని ఆ లక్ష్యాన్ని చేరే వరకు నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం వర్శిటీలో సేవలందిస్తున్న ఐదుగురు మహిళా సీనియర్ టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫును కలెక్టర్, ఉపకులపతి, అతిథులు సన్మానం చేసి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. **కాకినాడరూరల్** తిమ్మాపురం లోగల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం కమల కుమారి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉపకులపతి ఆచార్య జీవిఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రపంచంలో వివిధ ఘనతలు సాధించిన మదర్ థెరెసా, మేడమ్ క్యూరీ, ఇందిరాగాంధీ వంటి అనేక మహిళా మణుల జీవితాలను ఆయన ఉదహరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు, విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్యాంపస్ మహిళా విభాగ సమన్వయకర్త డాక్టర్ అనిలాంబిక ఆధ్వర్యంలో బోధన బోధనేతర మహిళా సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జొన్నకూటి


సామర్లకోట సభలో కేకును తినిపించుకుంటున్న కలెక్టర్, ఎంపిలు

సునీత, విభాగాధిపతులు, విద్యార్థులు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రాధా మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా జరిగిన 'బేటి బచావో- బేటి పడావో' అవగాహన సదస్సులో ఆరుగురు ఆడపిల్లలను కనీ,పెంచి, పెద్ద చేసి ప్రయోజకులను చేసిన కరుణమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్, బుద్దరాజు సత్యనారాయణ రాజు, సిహెచ్ సుబ్బారావు, రాఘవరావు, చంద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. **గండేపల్లి** మండలం సురంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో "ఐ.సి.సి. అభయ" ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ టు టౌన్ దిశ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఎస్.లక్ష్మీకాంతం ముఖ్య అతిథిగా హాజరయి దిశ యాప్ ఆవశ్యకతను వివరించి, విద్యార్థుల భవిష్యత్తు పై సోషల్ మీడియా ప్రభావం, ఇతరుల ట్రాప్ నుండి ఎలా రక్షించుకోవాలి, ఆపదలో ఉన్నప్పుడు దిశ యాప్‌లోగల ఎస్ఓఎస్ సర్వీస్ ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఐ.సి.సి. అభయ ఆధ్వర్యంలో మహిళా ఉద్యో గులకు, విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.రమేష్, డీన్ పి.రవి కుమార్, ఐ.సి.సి ప్రెసైడింగ్ ఆఫీసర్ ఎస్.శ్వేతా రాధా, కన్వీనర్ పి.లక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.


అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళను సత్కరిస్తున్న సభ్యులు

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం/అమలాపురం రూరల్

భట్నవిల్లి-పేరూరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రమాదాలు నివారణ కొరకు భట్నవిల్లి వద్ద, ఎర్ర వంతెన సమీపంలో డివైడర్లు, ప్రమాద నివారణ సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేసి సురక్షిత ప్రయాణాలకు అనువుగా బైపాస్ రోడ్డును నిర్మించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, గుత్తేదారులకు రోడ్డు నిర్మాణం, వాహన దారుల రోడ్డు భద్రతపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల జాప్యాలపై ఆయన జాతీయ రహదారుల ఇంజినీర్లతో ఆరా తీసి మార్చి నెలాఖరు నాటికి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా ఆదేశించారు. నూత నంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కేంద్రం అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ ను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించి ట్రాఫిక్ రద్దీని క్రమ బద్ధీకరించేందుకు వీలుగా ఈ రోడ్డు సదుపాయాన్ని వాహనదారులు, వాహన చోదకులకు అందుబాటులో తేవాలని ఆయన ఆదేశించారు. ఇకపై రోడ్డు నిర్మా ణంలో ఎటువంటి జాప్యాలకు తావు లేకుండా పూర్తి చేసి పట్టణంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు అందుబాటులో తేవాలని అధికారులు ఇంజినీర్లకు స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సాయి శ్రీనివాసు, సహాయక ఇంజనీర్ పురుషోత్తం, తహశీల్దార్ పి. శ్రీపల్లవి, స్థానిక అధికారులు గుత్తేదారులు పాల్గొన్నారు.


హైవే రోడ్డు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సొసైటీ లంక భూముల పరిశీలన

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలీ గ్రామంలో ఉన్న సొసైటీ లంక పంట పొలాలను జెసి ధ్యాన్ చంద్ర మంగళవారం పరిశీలించారు. ర్యాలీ గ్రామానికి చెందిన సొసైటీ సభ్యులు లంక భూములను కొన్ని సంవత్సరాల నుంచి ఏక్ సాల్ లీజుతో వ్యవసాయం చేసుకుంటున్నారు లంక భూములకు డి పట్టాలు ఇప్పించాలని స్థానిక ఎమ్ఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి రైతులందరూ విన్నవించారు. ఆయన ప్రభుత్వ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా స్పందించిన సిఎం జగన్ అర్హులకు భూములను పరిశీలించి అర్హత ఉన్నవారికి డి పట్టాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం జెసి ధ్యాన్ చంద్ర, తహశీల్దార్ డివిఎస్.అనిల్ కుమార్ తో కలిసి భూములను పరిశీలించి వివరాల అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదించి అర్హులైన వారికి డి పట్టాలు ఇస్తామన్నారు ఈయన వెంట రాష్ట్ర అవుట్ సర్సింగ్ ఎంప్లాయిస్ చైర్మన్ కప్పల శ్రీధర్ తదితరులున్నారు

నేడు మోటార్ సైకిళ్లకు వేలం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఇప్పనపాడు రూరల్ పోలీస్ స్టేషన్లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 15 మోటార్ సైకిళ్లకు బుధవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బల్ల శివ కృష్ణ తెలిపారు. రామచంద్రపురం డిఎస్పి బాల చంద్రారెడ్డి, సిఐ పెద్దిరెడ్డి శివ గణేష్ పర్యవేక్షణలో ఈ వేలం జరుగుతాయన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా ధరావతు రూ. 2వేలు చెల్లించాలన్నారు.

బాలిక వైద్యానికి సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

గణేష్ కాలనీకి చెందిన ముద్రగడ్డ యేసు రాజు కుమార్తె అరుణ కుమారి ఇటీవల గాలిబ్లాడర్లో రాళ్లు చేరుకుని అనారోగ్యానికి గురయ్యింది. దీంతో బాలికను వైద్యం కోసం హైదరాబాదుకు తరలించగా డాక్టర్లు చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని దీని నిమిత్తం రూ.4.50 లక్షలు వరకు ఖర్చు అవుతుందన్నారు. విషయం తెలుసుకున్న ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య, కుమార్ రాజా దంపతులు మంగళవారం రూ.10వేలు బాధిత కుటుం బానికి అందజేశారు. వైసిపి నాయకులు నాయుడు ప్రసాద్, వి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమృత్ సరోవర్ పథకంలో మంజూరైన చెరువులను ఉపాధి పిడి ఎస్.మధుసూదన్ మంగళవారం పరిశీలించారు. భీమనపల్లి విలసవిల్లి, గొల్లవిల్లి తదితర గ్రామాల్లోని చెరువులను పరిశీలించిన ఆయన త్వరితగతిన చెరువులు ఆరబెట్టి పూర్తిస్థాయిలో కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

విలవిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం విజయవాడ నయన కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ప్రారంభించారు. శిబిరంలో 100 మంది కంటి రోగులకు కంటి వైద్యనిపుణుడు డాక్టర్ ఎస్.కృష్ణమూర్తి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని కళ్లద్దాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్,క్రాా చిన్న, మధు,భార్గవ్,జానీ తదితరులు పాల్గొన్నారు.

కన్నడతోటలో వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-రామచంద్రపురం


ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్

కన్నడ తోటను కబళించిన జ్వరాలు పేరుతో 'ప్రజాశక్తి'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ద్రాక్షారామ ఆరోగ్య కేంద్రం వైద్యులు అలేఖ్య తన సిబ్బందితో గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. గ్రామ కార్యదర్శి భాస్కర్ లక్ష్మి గ్రామంలో బ్లీచింగ్ చల్లారు. మెడికల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి బాధితుల వివరాలను సేకరించారు ఐదు రోజులపాటు గ్రామంలో మెడికల్ క్యాంపు కొనసాగించాలని డివిజనల్ మెడికల్ అధికారి శివరంజని సూచించారు.

మోడీ పాలనలో పేదల బతుకు భారం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ప్రధాని నరేంద్ర మోడి పాలనలో అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు పేదల సొమ్మును దారాదత్తం చేస్తున్నారని పేదలు జీవనం మోడి ప్రభుత్వంలో భారంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపుమేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం మునిపల్లి ఎస్ బి ఐ వద్ద పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు పాల్గొన్నారు. **మండపేట** హెడన్ బర్గ్ నివేదికను బహిర్గతం చేయాలని, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా మోదీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా చేపట్టారు.

జిల్లాలో ముగిసిన ఎన్నికల కోడ్

ప్రజాశక్తి -అమలాపురం

స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసిపి అభ్యర్థి కుడిపూడి సూర్యనారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కాకినాడ జిల్లా జెసి, శాసనమండలి రిటర్నింగ్ అధికారి ఎస్.ఇలకియా అధికారికంగా ప్రకటించారు. దీంతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని మంగళవారంతో ముగించినట్లుగా ఉత్తర్వులు జారీ చేశారని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల గ్రాడ్యుయేట్లు స్థానిక సంస్థల నియోజకవర్గాలకు, శాసనమండలికి ద్వైవార్షిక ఎన్నికలకు సంబంధించి ప్రవర్తన నియమావళి ఫిబ్రవరి 9 2023 నుంచి అమల్లోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఇ సి ఐ సూచనల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి స్థానిక సంస్థల నియోజవర్గానికి సంబంధించి డాక్టర్ బిఆర్.అంబే ద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ముగించినట్లుగా ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

కేసుల ఉపసంహరణపై పునరాలోచించాలి

ప్రజాశక్తి -అమలాపురం

'కోనసీమ' అల్లర్ల కేసుల ఉపసంహరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి అని మంగళవారం అమలాపురంలో బుద్ధవిహార్ లో జరిగిన దళిత నాయకుల సమావేశం డిమాండ్ చేసింది. కేసుల ఉపసంహరణ రాజ్యాంగ విరుద్ధమని, కేసుల ఉపసంహరణ విషయంలో ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే ఉద్యమాలకు సిద్ధమవుతామని దళిత నాయకుల సమావేశం తీర్మానించింది.

'ఉపాధి' పనులు కల్పించాలని డిమాండ్


ప్రజాశక్తి-ముమ్మిడివరం


మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ, పనులు లేక, ఉపాధి పనులు కల్పిం చక పోవడంలో కూలీలు ఇబ్బంది పడు తున్నా రని, వారికి వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం, జిల్లా కమిటీ సమావేశం కుడిపూడి రాఘవమ్మ అధ్యక్షతన ముమ్మిడివరంలో జరిగింది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లా డుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేస్తున్న అరకొర నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్ళిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం సమస్యలపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా నుండి వేలాదిగా కూలీలు పాల్గొనాలని జిల్లా కమిటీ సమావేశం పిలుపు నిచ్చింది. జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధి హామీ సమస్యలు, స్థానిక సమస్యలను పరిష్కరించాలని, కొబ్బరి చెట్టు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. సమావేశంలో సంఘం జిల్లాఉపాధ్యక్షులు పాము బాలయ్య, బీర వెంకట్రావు, ఇసుకపట్ల మంగాదేవి, జి.దైవవాణి, క.శ్రీరామమూర్తి, పి.రాణి, క.మంగ, వి.సీతామహాలక్ష్మి, రాఘ వులు, పి.శ్రీనివాసరావు వెంకటరెడ్డి, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఉత్సవాలపై ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు


మాట్లాడుతున్న ఆర్‌డిఒ ముక్కంటి

చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు విజయవంతమయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపేట ఆర్‌డిఒ, ఉత్సవ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ ఎమ్.ముక్కంటి అన్నారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉత్సవాలపై ఆయన అధ్యక్షతన దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వెంకట సురేష్ బాబు, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, రామచంద్రపురం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్, డిఎల్‌పిఒ ఎం.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, తదితరులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 20న జాతర, 21న తీర్థం, 22న ఉగాది నుండి నెల రోజులు పాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా యాత్రికులు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నూకొమ్ము సూరిబాబు, ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఉండవల్లి వీర్రాజు చౌదరి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న కల్యాణం ఏర్పాట్లపై..

ఆత్రేయపురం ఏప్రిల్ 1 నుంచి వారం రోజుల పాటు జరిగే వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి సంబంధించియాత్రికులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని కొత్తపేట ఆర్‌డిఒ ముక్కంటి. అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవాల నిర్వహణపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి దేవస్థానం ఛైర్మన్ రమేష్ రాజు, ఇఒ ఎం.సత్యనారాయణ రాజు, గ్రామ సర్పంచ్ పోసిరాజు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గొల్లవిల్లి లో మంగళవారం వైఎస్ఆర్ సిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన జరిగిన సచివాలయ కన్వీనర్లు,గృహ సారథుల సమావేశం నిర్వహించారు. **మండపేట** సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. మంగళవారం స్థానిక ఏడిద రోడ్డులోని ఫంక్షన్ హాల్లో పట్టణ జెసిఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం జరిగింది.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. **ముమ్మిడివరం** జిల్లా మహిళాభివృద్ధి, శిశు అభివృద్ధి సంస్థ పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక' ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగినది. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా విచ్చేశారు. ఎస్‌పి కె.లతా మాధురి, డిఇఒ ఎం.కమల కుమారి, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, వర్కర్స్, హెల్పర్స్, వివిధ రంగాల నుంచి మహిళలు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి ప్రగతి సాధించాలని ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి అన్నారు. స్థానిక మహిళా శక్తి భవన్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి తహశీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎపిఎం కె.వెంకటలక్ష్మి, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు ములపర్తి దుర్గాభవాని, కార్యదర్శి నందికం పద్మావతి, విఒఎలను ఘనంగా సత్కరించారు. **రాజోలు** డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తగిన తోడ్పాటును అందిస్తోందని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.సుమలత అన్నారు. మలికిపురం లోని డిఆర్‌డిఎ, వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. **రామచంద్రపురం** స్థానిక మోడ్రన్ కళాశాల్లో మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలు పాల్గొన్నారు. న్యాయమూర్తులు జస్టిస్ కె.మాధవిదేవి, జస్టిస్ బి.వాణిశ్రీ, జస్టిస్ ఆర్.ఆశీర్వాదం పాల్ ప్రసంగించారు. **మండపేట** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. స్థానిక వైసిపి పార్టీ కార్యాల యంలో వాసవి క్లబ్ వనిత మండపేట ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాణిని సత్కరించారు. **మామిడికుదురు** జలజీవన్ మిషన్ కోనసీమ సేవా మండలి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ చెల్లుబోయిన శివరామ సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు కోటయ్య, పిఆర్‌కె.రాజు, జలజీవన్ మిషన్ సభ్యులు పాల్గొన్నారు. బి.దొడ్డవరంలో సచివాలయ కార్యదర్శి బద్దే మణి శ్రీ ని సత్కరించారు. **కొత్తపేట** ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర బ్రాహ్మణ మహిళా సాధికారతా సదస్సు నిర్వహించారు. కొత్తపేటకు చెందిన సత్తిరాజు ఉషారాణి మహిళలకు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయని శైలజ చేతుల మీదుగా రాజమహేంద్రవరంలో యూనీస్ లక్ష్మీ బాయి అవార్డుతో సత్కరించారు.


ఉప్పలగుప్తంలో మహిళలకు సత్కారం


బి.దొడ్డవరంలో మణిశ్రీకి సత్కారం



కొత్తపేటకు చెందిన ఉషారాణికి సత్కారం



నానాటికీ మహిళలకు రక్షణ కరువు

రాష్ట్రంలో మహిళలకు నానాటికి రక్షణ కరువవుతుంది. దాడులు విపరీతంగా పెరిగాయి. మహిళా వర్గంపై వివక్షత కొనసాగుతుంది. వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వర్కర్లకు వేధింపులు ఎక్కువయ్యాయి. పని భారం పెరిగింది. అసంఘటిత రంగ కార్మికులంతా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టం మహిళల రక్షణకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

- జి.బేబిరాణి, అఖిలభారత ఉపాధ్యక్షులు, సిఐటియు



మహిళా దినోత్సవ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు వచ్చినప్పటికీ నేటికీ పురుషులకు, మహిళలకు మధ్య సమానత్వం అనేది లేదు. ప్రభుత్వాలు మహిళలకు కనీస భద్రత కల్పించడంలో విఫలమయ్యాయి. మహిళలు, పురుషులు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధిక కమిటీ వేయాలన్నది కాగితాలకే పరిమితమైంది. మహిళను రెండో తరగతి పౌరురాలిగానే చూస్తున్నారు. దేశంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి మహిళలపై హత్యలు, అకృత్యాలు జరుగుతున్నాయి. చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి.

-కె.కృష్ణవేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా



మానసికంగా దృఢంగా ఉండాలి

మహిళలు మానసికంగా దృఢంగా ఉండాలి. కుంగిపోకుండా, క్షణికావేశములో తప్పుడు నిర్ణయాలను తీసుకుని అమూల్యమైన జీవితాన్ని మధ్యలోనే ముగిసిపోకుండా చూసుకోవాలి. ఏ విషయంలోనైనా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ప్రతి మహిళా తన కాళ్లపై నిలబడి సమాజానికి, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలి. మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో స్వావలంబన సాధించాలి. హక్కుల, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. ఏదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోనాలి. సాధికారత తీసుకురావాలంటే హక్కుల గురించి తెలుసుకోవడం ముఖ్యం. కుటుంబ బాధ్యతలు మాత్రమే కాకుండా ప్రతి రంగంలో చురుకైన పాత్ర పోషించాలి.

- ప్రత్యూష కుమారి, సీనియర్ సివిల్ జడ్జి

సమాన అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం



నేటి మహిళ అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నా.. పురుషులతో సమానమైన అవకాశాలను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మనువాద సిద్ధాంతాన్ని తలకెత్తుకున్న కేంద్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించాల్సింది పోయి మహిళలపై దాడులకు, అత్యాచారాలకు పాల్పడే నిందితుల పక్షాన నిలబడుతోంది. అటువంటి ఘటనలకు పాల్పడే వారికి మరింత ఊతమిస్తూ మహిళా రక్షణను మరింత ప్రశ్నార్థకం చేస్తుంది. మహిళల శ్రమను గుర్తించి పురుషులతో పాటు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి. చట్టసభల్లో మహిళలకు 33శాతం వాటా కల్పించాలి. మహిళల రక్షణకు సమగ్ర చట్టం తీసుకురావాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో వీటి కోసం ప్రతి మహిళా పోరాడాలి.

- తులసి, జిల్లా కార్యదర్శి, ఐద్వా, తూర్పుగోదావరి జిల్లా

తాగునీటిని అందించాలి

నిడదవోలు : నిడదవోలు ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు. మంచినీటి సౌకర్యం కల్పించాలని డిపో సౌకర్యాల సాధన పోరాట కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ప్రయాణికుల విన్నపం మేరకు డిపోలో సౌకర్యాలను. రాంబాబు, రమేష్ కృష్ణ, విద్యార్థులతో కలిసి పరిశీలించారు. దాతలు నీలం నాగేంద్ర ప్రసాద్, వాసా సురేష్ ఆర్థిక సహాయంతో సుమారు రూ.3లక్షల విలువ చేసే ఆర్‌ఒ ఏర్పాటు చేశారన్నారు. దీనిపై పర్యవేక్షణ లేకపోవడంతో తాగునీరు కరువైందన్నారు. ఇది ఆర్టీసి డిపో మేనేజర్ నిర్లక్ష్యమేనన్నారు. వేసవిలో ప్రయాణికులకు. అత్యంత అవసరమైన మంచి నీళ్ళ అందుబాటులోకి తీసుకురావాలని, ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

ఎల్ఐసి డివిజన్ కమిటీ ఎన్నిక

అధ్యక్షునిగా రాంబాబు

కార్యదర్శిగా కోదండరాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా జి.రాంబాబు, ఎం.కోదండరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సంఘం జోనల్ అధ్యక్షులు పి.సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జయం రోడ్‌లోని సూర్య గార్డెన్స్‌లో జరిగిన 26వ వార్షిక మహాసభలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. పూర్వపు ఉభయగోదావరి గోదావరి జిల్లాలకు చెందిన 20 శాఖా కార్యాలయాలు రాజమండ్రి డివిజనల్ ఆఫీస్‌తో కలిపి ఈ నాయకత్వం పనిచేస్తుందన్నారు. ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాస్, ఐవి.సుధాకర్, సత్యదేవ, సహాయ కార్యదర్శులుగా మాథ్యూస్, భరణి, సుబ్బారావు, కోశాధికారిగా ఈశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా గన్నెయ్య, పిఎస్ఎన్.రాజు, సాయిబాబా, రామకృష్ణ, ఉమాదేవి, రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పూర్వపు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఎంఐఎఫ్ బెనర్జీ, పి.సతీష్ అభినందించారు .

అకుంఠిత దీక్ష.... దృఢ సంకల్పం

-రంగం ఏదైనా చెరగని ముద్ర ఆమెది
- నేటి యువతులకు ఆదర్శంగా నిలుస్తున్న కలెక్టర్ మాధవీలత



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అకుంఠిత దీక్ష, దృఢ సంకల్పం ఆమెను ఉన్నత స్థానాల్లో నిలబెట్టాయి. శాస్త్రవేత్తగా మొదలైన ఆమె ప్రయాణం కలెక్టర్ స్థాయికి చేరింది. ఎలాంటి శిక్షణ లేకుండా తొలిప్రయత్నంలోనే గ్రూప్-1లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టాపర్‌గా నిలిచి చరిత్ర సృష్టించారు. అప్పటి నుంచి ఆమె వెనక్కి తిరిగి చూడలేదు. వృత్తిపై నిబద్ధతో పనిచేస్తూ కలెక్టర్ స్థాయికి ఎదిగి మహిళలు స్ఫూర్తిగా నిలిచారు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత. మహిళా దినోత్సవ సందర్భంగా ప్రజాశక్తి ఆమె పలుకరించిగా పలు విషయాలను వివరించారు.

అమ్మానాన్నా మాటలు పట్టుదలను పెంచాయి

మాది వైఎస్ఆర్ కడప జిల్లా. నాన్న కృష్ణారెడ్డి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్. అమ్మ రామలక్ష్మి గృహిణి. అమ్మా, నాన్నలకు ముగ్గురూ ఆడపిల్లలమే. నేను పెద్దదాన్ని. పెద్ద చెల్లెలు రాధిక అమెరికా స్టాన్ఫర్డ్ యూనివర్సిటీలో లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ సర్జన్. చిన్న చెల్లెలు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. చిన్నప్పట్నుంచి అమ్మానాన్నలు బాగా చదువుకోవాలని, ప్రయోజకురాలివి కావాలని చెప్పేవారు. వారి మాటలు నాలో పట్టుదలను పెంచాయి. అవి చదువు వైపు నడిపించాయి. నా భర్త పి.రామమునిరెడ్డి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సైంటిస్టు. ప్రస్తుతం పంచాయతీరాజ్‌లో వాటర్ షెడ్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. మాకు ఇద్దరు పిల్లలు. బాబు కౌశిక్ న్యూ ఢిల్లీలో ఎంబిబిఎస్ చేస్తున్నాడు. పాప హర్షిత నా వద్దే ఉంటోంది. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది.

అమ్మమాటే ఐఎఎస్ వరకూ నడిపించింది

ఉన్నత స్థానంలో నిలవాలని అమ్మ ఎప్పుడూ చెబుతూ ఉండేది. ఆమె మాటలే నన్ను ఐఎఎస్ వరకూ నడిపించాయి. తొలుత డిటిగా తర్వాత నంద్యాల, నెల్లూరు ఆర్‌డిఒగా, తిరుపతిలో 'తుడా' కార్యదర్శిగా పనిచేశాను. గ్రూప్-1 అధికారి నుంచి 2014లో ఐఎఎస్ అయ్యాను. లేదంటే నేను శాస్త్రవేత్తగా నా పరిశోధనలు ఇంకా కొనసాగిస్తూ ఉండేదాన్ని... అగ్రికల్చర్‌లో పిహెచ్‌డి చేశాను. కందులపై ప్రపంచంలోనే తొలిసారిగా పరిశోధనలు చేసి నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాను. ఇక్రిసాట్‌లో శాస్త్రవేత్తగా పనిచేశాను.

తల్లిదండ్రులు, భర్త సహకారం మరువలేనిది

చిన్నప్పుడు నా తల్లి తండ్రులు, వివాహం అయిన తరువాత భర్త సహకారం మరువలేనిది.వారి ప్రోత్సాహంతోనే నేడు కలెక్టర్‌గా పనిచేయగలుగుతున్నాను. నాలో ప్రతిభను గుర్తించింది వారే. నా భర్త పి.రామమునిరెడ్డి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సైంటిస్టు. ప్రస్తుతం పంచాయతీరాజ్‌లో వాటర్ షెడ్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. గ్రూప్-1కి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఆయనే సమకూర్చారు. రోజుకు 12 గంటలు కష్టపడి చదివాను. తొలి ప్రయత్నంలోనే (2007లో) మహిళా విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాను.

ప్రజలకు నిత్యం సేవ చేసే అవకాశం దక్కింది

జెసిగా తొలి పోస్టింగ్ కృష్ణా జిల్లాలో వచ్చింది. జిల్లాల విభజనతో తూర్పు గోదావరి జిల్లాకు తొలి కలెక్టర్‌గా గతేడాది ఏప్రిల్ 4న ఇక్కడ చేరాను. సైంటిస్ట్‌గా కొనసాగలేదన్న బాధ లేదు. ఎందుకంటే ఐఎఎస్ ప్రస్థానం నాకు ఎంతో సంతృప్తిగా ఉంది. ప్రజలకు నిత్యం సేవ చేసే అవకాశం దక్కిందన్న ఆనందం ఉంది. పురుషుడి విజయం వెనక మహిళ ఉంటుందంటారు. కాని నా విజయం వెనక 'ఆయన' ఉన్నారు. నాలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించారు. ఆయన ఆశల కనుగుణంగానే గ్రూప్-1కు ఎంపికయ్యాను.

పని ఒత్తిడిని ఇంట్లో చూపించను...

మహిళగా ఇంటి బాధ్యతలను ఎప్పుడూ విస్మరించలేదు. ఉద్యోగ నిర్వహణలో ఒత్తిడి ఉన్నా, ఆ ప్రభావం ఇంట్లో ప్రదర్శించ కుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాను. ప్రతి రోజూ ఉదయం రెండు గంటలు పిల్లలతో గడిపి వారి ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకుని, ఆ మేరకు ప్రోత్సహిస్తాను. తన భర్త, తల్లితండ్రులతో అవకాశం ఉన్నప్పుడు కలిసి భోజనం, కనీసం రాత్రి సమయంలో డిన్నర్ అయినా తప్పకుండా చేస్తాను. ఇంట్లో సభ్యులు కూడా నాకు పూర్తి సహకారం అందించడంతో నా పని మరింత సులభం అవుతోంది.

మహిళలు స్వయం నిర్ణయాధికారం కలిగి ఉండాలి

మహిళలు స్వయం నిర్ణయాధికారాన్ని కలిగి ఉండాలి. ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే స్థాయికి చేరుకోవాలి. ఎప్పుడూ కుటుంబం కోసం మాత్రమే కాకుండా వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రతిభను కనబరుస్తున్నారు. అంతరిక్షంలోకి కూడా అడుగుపెట్టిన ఘనత ఉంది. పలానా పోస్టు పురుషులకు మాత్రమే అనే హద్దులు నేడు చేరిగిపోయాయి. లింగ వివక్షపై పిల్లల్లో అవగాహన కల్పించడం తల్లి సామాజిక బాధ్యత..మహిళా చైతన్యంతోనే నవ సమాజ స్థాపన సాధ్యం అవుతుంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మహిళలు అన్ని రంగాల్లో పరిపూర్ణంగా రాణించాలి, స్త్రీ శక్తిని చాటాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తికి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆమె మాటల్లోనే...

ఒక మహిళగా గర్వపడుతున్నాను..

ఒక మహిళగా కలెక్టర్ స్థాయికి రావడం గర్వంగా ఉంది. మాది మధ్యతరగతి కుటుంబం. ఐఎఎస్ చదువుకోవడానికి తల్లిదండ్రులు, తోబుట్టువుల నుంచి సంపూర్ణ ప్రోత్సాహం లభించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుపై ఎక్కువగా దృష్టి పెట్టగలిగాను.

ప్రజలకు సేవచేసే అవకాశం రావడం అదృష్టం

జిల్లా కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం చాలా అదష్టంగా భావిస్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేను. అలాగే నా భర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. ఆయన సహకారం ఎనలేనిది. ప్రజలకు సేవ చేయడమే ముఖ్యంగా భావిస్తారు. ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. వాడు కూడా నా వత్తిని అర్థం చేసుకోవడంతోనే ఒత్తిడిని అధిగమించి పని చేయగలుగుతున్నాను.

మహిళల అభివృద్ధికి కృషి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను మహిళలకు అందేలా చర్యలు తీసుకుంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాను. అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టింది. వాటిని జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా చూస్తున్నాను. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో యు.కొత్తపల్లి మండలం, తొండంగిలో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశాం. మత్స్యకార మహిళలకు చేయూతనిచ్చే కార్యక్రమాలను చేపడుతున్నాం.

మహిళల భద్రతకు చర్యలు

మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటుంన్నాం. దిశ యాప్‌పై ప్రధానంగా ఫోకస్ పెట్టాం. జిల్లాలో నూరు శాతం మహిళల ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాం. దాడి జరగకముందే ఎవరిపైన అయినా అనుమానం ఉంటే యాప్ ద్వారా మహిళలు ఫిర్యాదులు చేయాలి. రాత్రి వేళల్లో మహిళలను సురక్షితంగా ఇళ్ల వద్దకు డ్రాపింగ్ చేయించే కార్యక్రమాన్ని పోలీసుల ద్వారా పక్కాగా అమలు చేస్తున్నాం. వన్ స్టాప్ సెంటర్ల ద్వారా మహిళలకు సహాయం చేసే కార్యక్రమాలను కూడా చేపట్టాం. మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు జరుగుతున్నప్పుడు ఫిర్యాదులు అందుతున్న వెంటనే దిశ పోలీసుల ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

సంతృప్తికర సేవలందించేలా పని

జిల్లాల విభజన ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంది. చిన్న జిల్లాగా ఉండటం వల్ల సేవలు చేరువయ్యాయి. దాదాపుగా జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించాను. అన్ని నియోజ కవర్గ కేంద్రాల్లోనూ రోస్టర్ ప్రకారం స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడకక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు సంతప్తికరమైన సేవలు అందించేందుకు నిరంతరం యంత్రాంగంతో పనిచేయిస్తున్నాం. మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించేందుకు అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ధైర్యంగా ముందడుగు వేయాలి. లక్ష్యాన్ని నిర్ధేశించుకుని దాని సాధనకు కృషి చేయాలి. పురుషులే చేయగలరనే ధోరణి నుంచి బయటకు రావాలి. పిల్లలకు చిన్ననాటి నుంచి లింగవివక్షపై అవగాహన కల్పించి సమర్థవంతమైన భావిభారత పౌరులుగా మార్చాలి.

అంచెలంచెలుగా ఎదిగిన అరుణకుమారి



అంచెలంచెలుగా ఎదిగి నాయకత్వ స్థానానికి చేరుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు ముక్కామలకు చెందిన అరిగెల అరుణకుమారి. సర్పంచ్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవులు చేపట్టింది ఆమె. బిఎస్‌పి పూర్తి చేసిన ఆమె 2013లో సర్పంచ్‌గా పోటీచేసి విజయం సాధించారు. ఆ సమయంలో గోదావరి మహా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించారు. మెరుగైన సేవలకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి పురస్కారం అందుకున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు సేవలను అందిస్తున్నారు. రెండు కాలువ రేవులను నిర్మించారు. 2014 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా కొవ్వూరు నియోజకవర్గంలో పోటీ చేశారు. 2019లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త వంకా రవీంద్రనాథ్ ఆశీస్సులుతో పెరవలి మండలం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలుగా గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మెడికల్ క్యాంపులు, కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు. తెలిపారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి సహకరించాలి



మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం సహకరించాలి. అవగాహన సదస్సులు నిర్వహించి తగిన వృత్తి శిక్షణ నైపుణ్యాలు అందించాలి. దీని వల్ల ఇంటివద్దే ఉండి ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఖాళీ సమయాల్లో టీవీ, మొబైల్‌తో గడపడం కన్నా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళలు ప్రయత్నించాలి.

- పచ్చిగోళ్ల సత్య కుమారి శ్రీ కోనసీమ మహిళా మండలి అధ్యక్షురాలు, హాలో కిడ్స్ స్కూల్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, అమలాపురం

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి..



ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. మహిళలు పోరాటపటిమ అలవర్చుకుని సమస్యలకు తలవంచకుండా ఎదురొడ్డి నిలవాలి. పోరాటం చేయడం నేర్చుకున్ననాడే మహిళా సాధికారత లభిస్తుంది. మహిళలు అన్ని విధాలా పూర్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.

- పోలిశెట్టి అనంతలక్ష్మి సత్యవతి, శ్రీ కోనసీమ మహిళా మండలి పూర్వ అధ్యక్షురాలు, లయన్స్ వశిష్ట క్లబ్ పూర్వ అధ్యక్షురాలు, అమలాపురం

రంగం ఏదైనా రాణించడమే లక్ష్యం



రంగం ఏదైనా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుష శక్తికి తామేమీ తీసిపోమని చాటిచెబుతోంది స్త్రీ శక్తి. నేను వైద్యురాలిగా సేవలలందిస్తున్నాను. 'సర్వీస్ టు హ్యూమానిటీ' ఆశయంతో ముందుకు వెళ్తున్నాను. ప్రతి స్త్రీ కూడా ఇంటి బాధ్యతతో పాటు సామాజిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగాలి. మహిళల అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

- ఐనాల సౌమ్య, వైద్యురాలు

మాటల్లోనే సమానత్వం



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 72 ఏళ్లయినా మహిళలు నేటికి దోపిడీకి గురవుతూనే ఉన్నారు. గహిణిగా శ్రమజీవిగా, ఉద్యోగిణిగా, ప్రజా ప్రతినిధిగా అన్ని రంగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నా సరైన గుర్తింపు లేదు. సమాన వేతనం దక్కడం లేదు. మహిళల సమానత్వం నాయకుల మాటల్లో తప్ప ఆచరణలో కనిపించట్లేదు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇంకా కలగానే ఉంది. ఇన్ని సమస్యలున్నా మహిళలు అన్ని రంగాల్లో పట్టుదలతో విజయం సాధించి దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలి.

- కోటిపల్లి రత్నమాల, సర్పంచ్, తాటిపాక, రాజోలు మండలం

మహిళా సాధికారతకు కృషిచేయాలి



మహిళ లేనిదే సష్టి లేదు, భూదేవంత సహనం కలవారు మహిళలు, మహిళలు చదువుకుంటున్నా ఇంకా ఆశించిన స్థాయిలో గౌరవం పొందడం లేదు. దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించినా, సమాజంలో ఇంకా మహిళలు వెనుకబడే ఉన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. మానసికంగా బలంగా ఉండి సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనాలి. అన్ని రంగాల్లో రాణించి మహిళా సాధికారత సాధించాలి. ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలి. భారతదేశంలో మహిళకున్న ఔన్నత్యాన్ని కాపాడాలి.

- ఒమ్మి బిందుమాధవి, జడ్‌పిటిసి, జగ్గంపేట

ప్రపంచ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ప్రపంచం అభివృద్ధిలో మహిళల పాత్ర ప్రధానమైనది. అటువంటి మహిళపై నేడు దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు మహిళల భద్రత కోసం తెస్తున్న చట్టాలపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసుకోవాలి. సమాజంలోని మహిళలపై జరుగుతున్న దాడులపై తోటి మహిళగా స్పందించే తత్వం అలవర్చుకోవాలి. దాడులు జరిగినప్పుడు ప్రతీ మహిళ ముందుకొచ్చి ప్రశ్నించాలి. అదే మార్పునకు నాంది అవుతుంది.

- కెబి.కృష్ణవేణి, ఎంఇఒ, కరప

మహిళలకు అధిక ప్రాధాన్యత



గత ప్రభుత్వానికి కంటే ఈ ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతి మహిళకూ పురుషులతో సమానంగా జగన్మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారు. మహిళల కోసం సిఎం జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టి మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

- పరిమి వెంకటలక్ష్మిమంగతాయారు, జడ్‌పిటిసి, గండేపల్లి

అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర



నేటి మహిళలు అన్ని రంగాల్లోనూ వారిదైన ముద్ర వేస్తున్నారు. అవని నుంచి అంతరిక్షం వరకు దూసుకుపోగల సామర్థ్యం, చురుకు, ఓర్పు స్త్రీ సొంతం. నేటి పోటీ ప్రపంచంలో పురుషులకు ధీటుగా రాణిస్తున్నారు. ఇంటి పనులను ఉద్యోగ ధర్మాన్ని సమానంగా నిర్వర్తిస్తూ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ తన బాధ్యతను ఎక్కడా మర్చిపోకుండా దూసుకుపోతున్న ప్రతి మహిళకూ శుభాకాంక్షలు.

- పోతుల శిరీష, పంచాయతీ కార్యదర్శి, గండేపల్లి